నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 13 ఏప్రిల్ 2024 | NIZAMABAD

## నగరంలో పోలీసు తనిఖీలు

పట్టుబడిన రూ.7లక్షలు



వినాయక నగర్, ఏప్రిల్ 12: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగరంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపడుతున్నారు. నగర సీఐ నరహరి ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. ఎల్లమ్మగుట్ట వద్ద నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై సంజీవ్, ఏఎస్సై రామకృష్ణ, సిబ్బంది రమేశ్, అనిల్, మనోజ్ వాహనాల తనిఖీ నిర్వహించగా.. మోర దీపక్ అనే వ్యక్తి వద్ద ఉన్న రూ.7 లక్షల నగదును పట్టుకున్నారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నదని, అనుమతి లేకుండా డబ్బులను తరలించకూడదని నగర సీఐ నరహరి సూచించారు. స్వాధీనం చేసుకున్న నగదును నిజామాబాద్ ట్రెజరీ విభాగంలో డిపాజిట్ చేసి, గ్రీవెన్స్ కమిటీకి సమాచారం అందించినట్లు తెలిపారు.



నిజామాబాద్ లోక్‌సభ స్థానంలో గులాబీ జెండా ఎగురవేయడంపై పార్టీ ముఖ్యనేతలు దృష్టి సారించారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, కోరుట్ల, జగిత్యాల ఎమ్మెల్యేలు సంజయ్, సంజయ్, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గణేశ్ గుప్తా, విద్యాసాగర్‌రావు, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా శుక్రవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. పార్టీ గెలుపు కోసం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

# కార్చిచ్చును ఆర్పేద్దాం..



- వేసవిలో పెరిగిన అగ్ని ప్రమాదాలు
- కార్చిచ్చు నివారణపై అటవీశాఖ ప్రత్యేక దృష్టి
- 40 మంది సిబ్బందితో ప్రత్యేక ప్రణాళిక
- అడవికి నిప్పు పెడితే జైలుకే

### మానవ తప్పిదాలు..అడవికి శాపాలు

*జీవకోటి మనుగడకు అడవులే ప్రధానం. చెట్లు అంతరించిపోతే పర్యావరణ సమతుల్యత లోపిస్తుంది. కరువు పరిస్థితులు ఏర్పడతాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి. అనేకచోట్ల మానవ తప్పిదాలే అడవులకు శాపాలుగా మారుతున్నాయి. మంటలతో చెట్లన్నీ బుగ్గిపాలవుతున్నాయి. ప్రస్తుతం ఆకురాలే కాలంలో ఇలాంటి ప్రమాదాలు మరింత ఎక్కువయ్యాయి. దట్టంగా పెరిగిన అడవులు బూడిదగా మారుతున్నాయి.*
*-వినాయక్‌నగర్, ఏప్రిల్ 12*



ఏటా ఎండాకాలంలో అడవుల్లో మంటలు చెలరేగడం చూస్తుంటాం. కొన్నిఘటనల్లో చెట్ల కొమ్మల రాపిడితో అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే.. ఎక్కువ శాతం మానవ తప్పిదాలే కార్చిచ్చుకు కారణంగా తెలుస్తున్నది. అడవుల గుండా రహదారుల వెంబడి వెళ్లేవారు బీడీలు, సిగరెట్లను నిర్లక్ష్యంగా పడేయడంతో ఎండుటాకులకు నిప్పంటుకొని మంటలు వ్యాపిస్తున్నాయి. మరోవైపు బొగ్గు, తూనికాకు సేకరించేవారు కూడా అడవులకు నిప్పంటించిన ఘటలను విచారణలో వెలుగు చూశాయి.

గతంలో తమిళనాడు రాష్ట్రంలోని పశ్చిమ కనుమల అడవుల్లో చెలరేగిన మంటల కారణంగా విలువైన సంపదతోపాటు పదిమంది అగ్నికి ఆహుతయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అటవీశాఖ మరింత అప్రమత్తమైంది. అడవులను దహించే కార్చిచ్చును ఎప్పటికప్పుడు ఆర్పేయడానికి ముందస్తు ప్రణాళికను సిద్ధంచేసింది. ఇందులో భాగంగా ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీని నియమించింది.

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రివెన్షన్, డిటెన్షన్, పోస్ట్ ఫైర్ మేనేజ్‌మెంట్ విధానలపై క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్ధిష్టమైన సూచనలు చేసింది.

#### ఇటీవల మల్లారంలో మంటలు..

నిజామాబాద్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని మల్లారం అటవీ ప్రాంతంలో మార్చి 28వ తేదీన మంటలు చెలరేగి కొంత ఏరియా పూర్తిగా దగ్ధమైంది. మంటలను గుర్తించిన స్థానికులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పద్మారావు తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక శాఖ సహకారంతో మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గుర్తు తెలియని పశువుల కాపరులు నిప్పంటించడంతోనే ఈ మంటలు చెలరేగినట్లు అధికారులు అనుమానం వ్యక్తంచేశారు.

#### నిర్దేశిత ప్రాంతాల్లో ఫైర్‌లైన్స్..

తూనికాకు సేకరించేవారి కారణంగా అడవులు తగలబడుతున్నట్లుగా అధికారులు గుర్తించారు. వీటిని నివారించేందుకు అటవీశాఖ ప్రత్యేక చొరవతో తూనికాకు పెరుగుదలకు సహకరిస్తున్నది. ఇందుకోసం ఫైర్ లైన్స్ చేపడుతున్నారు. ఎండుటాకులను పోగుచేసి చుట్టుపక్కల మంటలు వ్యాపించకుండా దగ్గరుండి నిప్పంటిస్తున్నారు. దీనిద్వారా ప్రమాదాలను అదుపుచేయొచ్చని భావిస్తున్నారు.

#### అనుమతి లేకుండా అడవిలోకి వెళ్లొద్దు..

మానవ తప్పిదాల కారణంగా అడవులో అగ్ని ప్రమాదాలు జరగుతున్నట్లు గుర్తించాం. అటవీ సంపదకు తీవ్ర నష్టం జరుగుతున్నది. ఫారెస్టు అధికారుల అనుమతి లేకుండా అడవుల్లోకి వెళ్తే కేసులు నమోదు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.



-వికాస్ మీనా, డీఎఫ్‌వో, నిజామాబాద్

#### అగ్ని ప్రమాదాల నియంత్రణకు ఫైర్ బ్లోవర్స్..

అడవుల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించకుండా ఫారెస్ట్ సిబ్బంది రంగంలోకి దిగి నియంత్రిస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఫైర్ బ్లోవర్స్ ఏర్పాటుచేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 10 బ్లోవర్స్ అందుబాటులో ఉన్నాయి.

#### ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో నిఘా..

నిజామాబాద్ జిల్లాలోని నిజామాబాద్, ఆర్మూర్ ఫారెస్టు డివిజన్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో 40 మందితో కూడిన స్ట్రయికింగ్ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచిన్నట్లు అధికారులు తెలిపారు. నిజామాబాద్ డివిజన్‌లో నిజామాబాద్ నార్త్ రేంజ్, నిజామాబాద్ సౌత్ రేంజ్, ఇందల్వాయి, వర్ని రేంజ్‌తోపాటు ఆర్మూర్ డివిజన్‌లోని కమ్మర్‌పల్లి రేంజ్, ఆర్మూర్, సిరికొండ రేంజ్ పరిధిలో ప్రత్యేక ఫోర్స్‌ను అందుబాటులో ఉంచారు. అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగిన సమాచారం అందిన వెంటనే మంటలను ఆర్పేందుకు ఈ ర్యాపిడ్‌యాక్షన్ ఫోర్స్ సిద్ధంగా ఉంటుంది. అంతే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన రక్షణ సిబ్బందికి ఎస్ఎంఎస్ అలర్ట్ వెళ్తుంది. దీని ద్వారా ప్రమాదం జరిగిన ప్రదేశానికి దగ్గరలో ఉన్న సిబ్బంది జీపీఎస్ ద్వారా ఘటనా స్థలానికి చేరుకుంటారు. అగ్నిప్రమాదాలకు కారణమైన వారికి ఆరునెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని అధికారులు హెచ్చరించారు.



# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరానికి రూ.25వేలు పరిహారం ఇవ్వాలి
- మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి డిమాండ్
- కోటగిరి, వర్ని, చందూర్ మండలాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటల పరిశీలన



సోంపూర్‌లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

కోటగిరి/వర్ని, ఏప్రిల్ 12: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎకరాకు రూ.25వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కోటగిరి మండలం టాక్లీ, సోంపూర్‌తోపాటు వర్ని మండలంలోని జలాల్‌పూర్, సైద్‌పూర్, చందూర్ మండలం మేడిపల్లి, లక్ష్మీసాగర్ తండా గ్రామాల్లో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలను తెలుసుకొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోచారం మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు చేతికొచ్చిన వరి పంట దెబ్బతిన్నదని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో జరిగే నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. రైతుల బాధ చూస్తుంటే ఒక రైతుగా తాను తట్టుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయాధికారులు వెంటనే సర్వే చేపట్టి పంట నష్టంపై నివేదికను ప్రభుత్వానికి పంపాలని సూచించారు. పంట చేతికొచ్చాక రైతులు పూర్తిగా నష్టపోయారని, వారిని ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పోచారం వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి, జడ్పీటీసీ శంకర్‌పటేల్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ సిరాజ్, మండల కన్వీనర్ ఎజాజ్‌ఖాన్, ఏఎంసీ మాజీ చైర్మన్ నీరడి గంగాధర్, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, చాకూరే గంగాధర్, నాగరాజుగౌడ్, శివరాజ్‌పటేల్, షాజీ, మల్లేశ్, దిగంబర్‌పటేల్, సంజీవ్‌పటేల్, రాంబాబు, గోపు సాయిలు, పావుడే రాజేందర్, రైతుబంధు సమితి వర్ని మండల కన్వీనర్ సింగంపల్లి గంగారాం, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబాలకు జాజాల పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 12: లింగంపేట్ మండలం కొండాపూర్‌తండాలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పలువురి నివాసపు గుడిసెలు కాలిపోయాయి. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ శుక్రవారం పరామర్శించారు. కాలిపోయిన నివాసపు గుడిసెలను పరిశీలించారు. అన్ని విధాలా ఆదుకుంటామని, అండగా ఉంటామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేశ్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, ఎంపీటీసీ గన్యానాయక్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, నర్సింహులు, ఎంపీటీసీ సురేందర్, నాయకులు సత్యం, మహిపాల్‌రెడ్డి, మనోహర్, పర్వయ్య తదితరులున్నారు.

# వడ్డీ వ్యాపారులపై కొరడా

- ఇండ్లపై పోలీసుల దాడులు
- ఫైనాన్స్‌లు, దుకాణాల్లోనూ విస్తృత తనిఖీలు
- ప్రామిసరీ నోట్లు, బ్లాంక్ చెక్కులు స్వాధీనం
- పలువురు వ్యాపారులపై కేసు నమోదు



గాంధారిలోని ఓ వ్యాపారి వద్ద సోదాలు చేస్తున్న పోలీసులు

గాంధారి/భిక్కనూరు/నస్రుల్లాబాద్/ ఎల్లారెడ్డి రూరల్/బిచ్కుంద, ఏప్రిల్ 12: కామారెడ్డి జిల్లాలో వడ్డీ వ్యాపారులపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. జిల్లా కేంద్రంతోపాటు గాంధారి, భిక్కనూరు, నస్రుల్లాబాద్, బీర్కూర్, ఎల్లారెడ్డి పట్టణంలో వడ్డీ వ్యాపారుల ఇండ్లపై పోలీసుల దాడులు కలకలం రేపింది. అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారి ఇండ్లు, ఫైనాన్స్ కార్యాలయాలతోపాటు దుకాణాల్లోనూ దాడులు చేశారు. భిక్కనూరులో కోడిప్యాక వెంకటేశం, మురికి రాజేశం వ్యాపారుల వద్ద ప్రామిసరి నోట్లు లభ్యం కావడంతో సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. బీర్కూర్ మండల కేంద్రంలోని గోపి మహాదన ఇంట్లో 21 ప్రామిసరి నోట్లు, రెండు చెక్కులు లభించగా..ఆయనపై మనీల్యాండరింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గాంధారిలో సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, గాంధారి ఎస్సై ఆంజనేయులు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఎల్లారెడ్డి పట్టణంలో ప్రముఖ వ్యాపారి రాచకొండ రామకృష్ణ ఇంటిపై పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేశారు. సదరు వ్యాపారి నుంచి 15 బ్లాంక్ చెక్కులు, ఒక ప్రామిసరీ నోట్‌ను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బిచ్కుందలో నాల్చర్ బాలరాజ్, కాపర్తి విఠల్ ఇండ్లలో తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేసినట్లు సీఐ జగడం నరేశ్, ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. నాల్చర్ బాలరాజ్ అధిక వడ్డీ వసూలు చేస్తున్నట్లు నిర్ధారించినట్లు వారు పేర్కొన్నారు.



భిక్కనూరులో పోలీసుల తనిఖీలు

### 23 మందిపై కేసులు నమోదు చేశాం..

-కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ



కామారెడ్డి, ఏప్రిల్ 12: జిల్లాలో అక్రమ మార్గాలు, వడ్డీల ద్వారా అమాయక ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న 23 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 70 మంది వ్యాపారులపై దాడులు చేసి 23 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రూ.49. 58 లక్షలు, 157 గ్రాముల బంగారం, 315 ప్రామిసరీ నోట్లు, 63 ల్యాండ్ డాక్యుమెంట్లు, 25 చెక్స్, పట్టా పాస్ పుస్తకాలు, ఖాళీ ప్రామిసరీ నోట్లతోపాటు ఇతర డాక్యుమెంట్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు, మోసపూరిత మాటల ద్వారా మరికొందరు వ్యాపారులు ఆర్థిక సాయం చేస్తామంటూఅమాయక ప్రజల నుంచి ఇండ్లు, ప్లాట్లు, వ్యవసాయ భూముల దస్తావేజులను తీసుకొని అప్పులు ఇస్తున్నారని తెలిపారు. అధిక వడ్డీ రేట్ల లెక్కలు చూపుతూ చెల్లించలేని పరిస్థితులను తీసుకువస్తూ వారి ఆస్తులను జప్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బాల్‌భవన్‌లో వేసవి ప్రత్యేక శిక్షణ

- 30 అంశాలు... 53 రోజులు
- 18నుంచి తరగతులు ప్రారంభం
- 5-16 ఏండ్ల లోపువారు అర్హులు






యోగా చేస్తున్న చిన్నారులు (ఫైల్)

సుభాష్‌నగర్, ఏప్రిల్ 12: బాలల్లోని సృజనాత్మకతను పదును పెట్టేందుకు ఇందూరు నగరంలోని బాల్‌భవన్ ఆధ్వర్యంలో ఏటా వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఈ నెల 18 నుంచి జూన్ 10 వరకు 53 రోజులపాటు శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిత్రలేఖనం, భరతనాట్యం, జానపద నృత్యం, కర్ణాటక గాత్రం, లలిత సంగీతం, మెహిందీ, నీతిశ్లోకాలు, కథలు, పద్యాలు, ఇంద్రజాలం, స్కేటింగ్, యోగా, కర్రసాము, అల్లికలు, గ్లాస్‌పెయింటింగ్, వృథా వస్తువులతో అందమైన ఆకృతుల తయారీ తదితర అంశాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. నిత్యం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తరగతులు ఉంటాయి.

#### 5-16 ఏండ్ల లోపువారు అర్హులు..

వేసవి శిక్షణ తరగతుల్లో చేరే వారి వయస్సు 5 నుంచి 16 ఏండ్లలోపు ఉన్న బాలబాలికలు అర్హులు. రూ. 300 ఫీజు చెల్లించి, 2 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, బర్త్ సర్టిఫికెట్‌ను జతచేసి బాల్‌భవన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

#### భారీగా దరఖాస్తులు..

మార్చి 25 నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు 500లకు పైగ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వేసవి నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థుల కోసం కూలర్లు, తాగునీటి వసతి కల్పిస్తున్నాం. మరిన్ని వివరాలకు బాల్ భవన్ కార్యాలయంలో లేదా 9948095698 నవబర్‌ను సంప్రదించాలి.



-ప్రభాకర్, పర్యవేక్షకుడు